నమస్తే తెలంగాణ
వికారాబాద్
I హైదరాబాద్, శనివారం 28 సెప్టెంబర్ 2024 VIKARABAD

## ప్రభుత్వ యంత్రాంగమంతా.. మూసీ వెంటే



సిటీబ్యూరో: ప్రభుత్వ యంత్రాంగమంతా మూసీ వెంటే ఉంటోంది. మూసీ రివర్‌బెడ్ పరిధిలోని పలు కాలనీల్లో సిబ్బంది మకాం వేశారు. తహసీల్దార్ల నేతృత్వంలోని బృందాలు సర్వే చేయడం, మార్కింగ్ చేయడానికి సిద్ధమవుతుంటే స్థానికులు అడ్డుకుంటున్నారు. గురువారం కొంతమేరకు మార్కింగ్ చేయగలిగినా.. శుక్రవారం మాత్రం అధికారులను ప్రతిఘటించారు. ఒకవైపు ప్రజలు తమ ఇండ్లు కోల్పోకుండా కాపలాకాస్తుంటే.. మరోవైపు ప్రభుత్వ సిబ్బంది ఎప్పుడెప్పుడు జనాల గృహాలను కూలగొడదామా.. అంటూ తిరుగుతున్నారు.



ఇబ్రహీంపట్నంలోని ఇందిరమ్మ కాలనీ



అత్తాపూర్ క్రాస్‌రోడ్ వద్ద నిర్వాసితుల నిరసన

# క్షణ క్షణం.. బుల్డోజర్ భయం!



సర్వే సైరన్.. మూసీ నిర్వాసితుల పరేషాన్

**పోలీసు పహారాలో మార్కింగ్**

**గూడు కోసం రాత్రుల్లో సైతం కాపలా • రెండో రోజూ పరీవాహక ప్రాంతాల్లో సర్వే**

- అడ్డొస్తే లోపలేస్తామంటూ నిర్వాసితులకు బెదిరింపులు
- డ్రోన్ సర్వే ఆధారంగానే డబుల్ బెడ్రూంలు
- మూసీ తీరం వెంట 40వేలకు పైగా కట్టడాలు
- రివర్ బెడ్‌లోనే వేలాదిగా..
- వాటికి మార్కింగ్ చేయని వైనం
- రెండు పడకల ఇండ్లు లేనట్టేనా.. అనే సందేహాలు
- కాలనీలోకి రావొద్దంటూ .. అధికారులను అడ్డుకున్న బాధితులు
- మార్కింగ్ వద్దంటూ వేడుకోలు
- పెట్రోల్ పోసుకొని.. పూల వ్యాపారి ఆత్మహత్యాయత్నం




ఏ క్షణం.. ఏ బుల్డోజర్ తమపైకి వచ్చి పడుతుందోనన్న గాబరా..ఇన్నేండ్ల ఆధారం రెప్పపాటులో కుప్పకూలిపోతుందేమోనన్న హైరానా.. వెరసి మూసీ నిర్వాసితులు క్షణక్షణం భయంతో గడుపుతున్నారు. ఈ నేపథ్యంలో అధికారుల సర్వే వారికి మరింత గుండెదడ తెప్పిస్తున్నది. మూసీ పరీవాహక ప్రాంతాల్లో రెండో రోజు శుక్రవారం సైతం నిరసనలు, ప్రతిఘటనల మధ్యే రెవెన్యూ అధికారుల సర్వే కొనసాగింది. ఉప్పల్, రాజేంద్రనగర్, బహదూర్‌పురా, ఆసిఫ్‌నగర్, చార్మినార్, అంబర్‌పేట, గోల్కొండ ఇబ్రహీంబాగ్, లంగర్‌హౌస్ డిఫెన్స్ కాలనీ, చాదర్‌ఘాట్, శంకర్‌నగర్, ముసారాంబాగ్, కొత్తపేట, మారుతీనగర్ తదితర ప్రాంతాల్లో సర్వే చేశారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్‌లో 26 బృందాలు మూసీ రివర్ బెడ్‌లో ఉన్న నిర్మాణాలకు మార్కింగ్ చేశాయి. అయితే అధికారులకు ఎక్కడికక్కడ వ్యతిరేకతే ఎదురైంది. నిర్వాసితులు సర్వే బృందాలను తమ ఇండ్ల వద్దకు రానివ్వకుండా అడ్డుకున్నారు. కొన్ని ప్రాంతాల్లో స్థానికులకు, అధికారులకు మధ్య తోపులాట జరిగింది. ఇంకొన్ని చోట్ల తమ ఇండ్లకు మార్కింగ్ ఇవ్వొద్దంటూ భీష్మించుకూర్చున్నారు. చైతన్యపురిలో ఓ పూల వ్యాపారి ఆత్మహత్యకు యత్నించడం మరింత ఉద్రిక్తత పెంచింది. పాతబస్తీలో మూసీ నిర్వాసితులు రోడ్లపైకి వచ్చి ప్లకార్డులు ప్రదర్శిస్తూ ఆందోళన చేపట్టారు. 'రేవంత్ రెడ్డి నువ్వు సీఎం కావడం మా దౌర్భాగ్యం' అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. అడ్డుకోవడానికి యత్నిస్తున్న చాలా మందికి పోలీసుల నుంచి బెదిరింపులు ఎదురయ్యాయి. లోపలేస్తామంటూ నిర్వాసితులపై జులుం ప్రదర్శించినట్టు బాధితులు తెలిపారు.

-సిటీబ్యూరో, సెప్టెంబర్ 27
(నమస్తే తెలంగాణ)



కాంగ్రెస్ సర్కార్‌కు పేదల ఉసురు తగుల్తది!

## పునరావాసాలపై డ్రోన్ దెబ్బ..



అసలే గూడు కోల్పోవాల్సి వస్తున్నదని బాధపడుతున్న బడుగులకు మరో ఎదురుదెబ్బ తగలనున్నది. మూసీ రివర్ బెడ్‌లో నివాసమున్న అందరికీ డబుల్ బెడ్రూం ఇండ్లు వచ్చే అవకాశం లేదు. అధికారులు కేవలం కొన్ని నిర్మాణాలకే మార్కింగ్ చేస్తున్నారు. ఇదేంటని కొంతమంది ప్రశ్నిస్తే డ్రోన్ సర్వే ప్రకారం తమకిచ్చిన నిర్మాణాలకు మాత్రమే మార్కింగ్ చేస్తున్నామంటూ చెబుతున్నారు. డబుల్ బెడ్రూంలు వద్దు ఇక్కడే ఉంటామని చెబుతున్న ఆ ఇండ్ల వారికి అందరికీ గృహాలు రావనే విషయంపై అవగాహన లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం కొన్ని నెలల కిందట మూసీకి ఇరువైపులా 2 కిలో మీటర్ల మేర డ్రోన్ సర్వే చేపట్టింది. ఆ సర్వేలో ఎఫ్‌టీఎల్‌తో పాటు బఫర్ జోన్‌లో ఎన్ని ఆక్రమణలున్నాయో సర్వే చేశారు. జీయో ఇన్ఫర్మేషన్ సిస్టం(జీఎస్ఐ)తో అనుసంధానం చేశారు. కాగా, ఈ సర్వేలో రివర్ బెడ్(నది గర్భం)లో 2,116 నిర్మాణాలు, బఫర్ జోన్‌లో మరో 7,850 నిర్మాణాలున్నాయని అధికారులు గుర్తించారు. ఇప్పుడు రెవెన్యూ అధికారులు వాటికే మార్కింగ్ చేస్తున్నారు. అయితే రివర్ బెడ్‌లో ఉన్న అన్ని నిర్మాణాలకు అధికారులు మార్కింగ్ చేయకపోవడం పలు అనుమానాలకు తావిస్తున్నది. కూల్చివేతలు ప్రారంభమయ్యాక మార్కింగ్ వేసినవి..వేయనివి అన్నీ మూసీలో కలిసిపోతాయి. కేవలం అధికారులు మార్కింగ్ వేసిన వారికి మాత్రమే డబుల్ బెడ్రూంలు కేటాయించనున్నారు. మిగిలిన వారు రోడ్డున పడాల్సిన దుస్థితి ఏర్పడనున్నదని సామాజికవేత్తలు చెబుతున్నారు.

## ఎక్కడికో తరలిస్తే.. మా జీవనోపాధి ఎలా?




అధికారుల కాళ్ల వేళ్ల పడుతూ.. మూసీ వాసులు ఆర్తనాదాలు చేస్తున్నారు. అయినా వీరి ఆక్రందన రేవంత్ సర్కార్ వినడం లేదు. కష్టపడి పైసా పైసా కూడబెట్టుకుని ఇల్లు కట్టుకుంటే కూల్చేస్తామంటూ రావడం ఏంటని బాధితులు ఆగ్రహం వ్యక్తం చేశారు. చావడానికైనా సిద్ధం..కూల్చనివ్వమంటూ పూల వ్యాపారి మహేశ్ అధికారులను అడ్డుకునే యత్నం చేశాడు. 'పూల వ్యాపారం చేసుకుంటూ.. నా కుటుంబాన్ని పోషిస్తున్నాను. నా భార్య ఇప్పుడు నిండు గర్భిణి. నా చెల్లెండ్లు ఇక్కడే దగ్గర చదువుకుంటున్నారు. అధికారులు ఇప్పుడు వచ్చి ఎక్కడో నగరం అవతల డబుల్ బెడ్రూం ఇల్లు ఇస్తాం.. ఖాళీ చేయమంటే ఎలా. జీవనోపాధి ఎలా పొందేది. రెక్కాడితో గానీ డొక్కాడని కుటుంబం మాది. ప్రాణం పోయినా ఇక్కడే ఉంటాం.. ఇల్లు మాత్రం ఖాళీ చేయం. బలవంతంగా ఇల్లు ఖాళీ చేయాలని చూస్తే చావడమే శరణ్యం' అంటూ మహేశ్ తల బాదుకుంటూ..పెట్రోల్ పోసుకొని..ఆత్మహత్యకు యత్నించాడు.




అత్తాపూర్‌లో బాధితుల నిరసన

# కంటిమీద కునుకులేదు కడుపు నిండ తిండిలేదు

**ఇందిరమ్మ రాజ్యంలో ఇందిరానగర్ కాలనీవాసుల గోడు**

**హైడ్రా అధికారుల రాకతో బిక్కుబిక్కుమంటున్న పేదలు**

ఇబ్రహీంపట్నం, సెప్టెంబర్ 27 : రెక్కాడితే గాని డొక్క నిండని బడుగు జీవులు ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ పరిధిలోని వడ్డెర బస్తీలో ఇండ్లు కట్టుకుని 30 ఏండ్లుగా నివాసముంటున్నారు. ఇందిరమ్మ కాలనీగా నామకరణం చేసుకోవడంతో కొంతమందికి ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లనూ కేటాయించింది. నాలుగు రోజుల కింద హైడ్రా అధికారులు వచ్చి కాలనీ మొత్తం ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్నదని, ఇండ్లను కూల్చివేస్తామని చెప్పారు. దీంతో ఆ కాలనీవాసులు పనులకు వెళ్లకుండా క్షణం..క్షణం భయం..భయంగా ఇండ్ల మధ్యనే ఉంటున్నారు. కాలనీలోకి ఏ కొత్త కారు వచ్చినా.. ఏ కొత్త మనిషి వచ్చినా భయపడుతున్నారు. ఇందిరానగర్‌లో సుమారు 70 కుటుంబాలకు చెందిన వడ్డెర వాళ్లు ఇక్కడ స్థిర నివాసముంటున్నారు. రాళ్లు, కంకరకొట్టి విక్రయించుకుని జీవనం సాగిస్తున్నారు. రూపాయి.. రూపాయి పోగు చేసుకుని కట్టుకున్న ఇండ్లను నేల మట్టం చేస్తామని అధికారులు చెప్పడంతో బిక్కుబిక్కుమంటూ భయాందోళన చెందుతున్నారు. ఒక్కొక్కరు 100 నుంచి 150 గజాల స్థలాలను కొనుగోలు చేసుకున్నారు. కొంతమందికి ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద ప్రభుత్వం రుణాలను సైతం ఇచ్చింది. సాఫీగా సాగుతున్న వీరి జీవితాల్లో ఒక్కసారిగా హైడ్రా భయం వణుకు పుట్టిస్తున్నది.

### హైడ్రా రాకతో భయం గుప్పిట్లో..

ఈనెల 22న హైడ్రా అధికారులు, ఇరిగేషన్, పోలీసు అధికారులతో కలిసి ఇబ్రహీంపట్నం పెద్ద చెరువును పరిశీలించారు. చెరువు సమీపంలోని ఇందిరమ్మ కాలనీ, చిన్న చెరువు సమీపంలోని ఎన్‌కే గార్డెన్, పరిసరాల్లో ఉన్న ఇండ్లు ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లో ఉన్నాయని గుర్తించారు. చిన్నచెరువులో ఎఫ్‌టీఎల్ లోపల నిర్మించిన ఇండ్లను గుర్తించి వాటిని ఖాళీ చేయాల్సిందిగా ఇప్పటికే మున్సిపల్ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. చిన్నచెరువు సమీపంలో సుమారు 50 నుంచి 60, పెద్ద చెరువు సమీపంలో ఇందిరమ్మ కాలనీలో 70 ఇండ్లను కూల్చివేస్తామని అధికారులు చెప్పారు. దీంతో వారం రోజులుగా కాలనీవాసులు ఇండ్ల వద్దే ఉంటూ తమ భవిష్యత్తు ఏమిటనే దానిపై చర్చించుకుంటున్నారు. తాము, తమ పిల్లలు ఆగమవుతామని ఇండ్లను కూల్చివేయవద్దని వేడుకుంటున్నారు.

### దసరా తర్వాత కూల్చివేతలుంటాయా ?

నగరానికే పరిమితమైన హైడ్రా మొట్టమొదటిసారిగా ఇబ్రహీంపట్నం పెద్దచెరువుతో పాటు తుర్కయాంజాల్ మాసబ్‌చెరువుపై దృష్టి సారించింది. ఈ చెరువుల్లో పెద్ద ఎత్తున ఆక్రమణలు జరిగాయని గుర్తించారు. అందులో భాగంగానే ఈ రెండు చెరువుల్లో ఇరిగేషన్, హైడ్రా, పోలీసు అధికారులు క్షుణంగా పరిశీలించారు. ఆక్రమణల లోపల ఎన్ని ఇండ్లు ఉన్నాయనేదానిపై నివేదిక తయారు చేశారు. దసరా తర్వాత నిర్మాణాలను కూల్చివేసే అవకాశాలు ఉన్నట్లు అధికార వర్గాల ద్వారా తెలిసింది.

### నిద్రాహారాలు లేవు..



నా వయస్సు 70 ఏండ్లు.. 30 ఏండ్ల కింద ఇల్లు కట్టుకుని ఉంటున్నా. తాను.. తన పిల్లలు కష్టపడి సంపాదించిన డబ్బుతో ఇల్లు నిర్మించుకున్నా. ఈనెల 22న కొంతమంది సర్కారు పెద్దసార్లు వచ్చి మా ఇల్లు చెరువులో ఉన్నదని, కూల్చివేస్తామని చెప్పారు. ఇప్పటివరకు మా ఇండ్లలోకి చుక్కనీరు వచ్చిన దాఖలాలు లేవు. మాలాంటి బడుగు జీవులను బాధపెట్టొద్దు.

– వెంకటయ్య, వడ్డెర బస్తీ

### తిండి తినబుద్ధి ఐతలేదు..



గత ఐదు రోజులుగా నిద్రపడ్తలేదు. తిందామంటే తిన బుద్ధి ఐతలేదు. ఐదురోజుల కింద పెద్దపెద్ద కార్లల్ల పెద్దోళ్లు వచ్చి మా కాలనీల తిరిగింద్రు. 30 ఏండ్ల కింద ఇక్కడ ఇల్లు కట్టుకున్నం. కాయ కష్టం చేసుకుని బతుకుతున్నాం. ఇల్లు కూలగొడితే మేము ఏడ బతకాలె. మాలాంటి పేదోళ్ల కడుపు కొట్టొద్దు రేవంత్‌సారు.. మీకు పుణ్యముంటది.

– నర్సమ్మ, వడ్డెర బస్తీ

### పేదల పొట్ట కొట్టొద్దు..



కాయ కష్టం చేసి జీవితాంతం రెక్కలు ముక్కలు చేసుకుని.. ఇండ్లు కట్టుకున్న పేదల పొట్ట మీద కొట్టొద్దు. పెద్ద చెరువు పూర్తిగా నిండినా ఈ కాలనీలోకి నీరు రాదు. రెక్కాడితే, డొక్కాడని బడుగుల ఇండ్లు కూల్చిస్తే సహించేది లేదు. రేవంత్‌రెడ్డి ఎన్నికల ముందు పేదలకు ఇచ్చిన హామీలను మరిచి వారి జీవితాలతో ఆడుకోవడం సరైన పద్ధతి కాదు.

– మైలారం విజయ్‌కుమార్, ఇబ్రహీంపట్నం



భయం గుప్పిట్లో బిక్కు.. బిక్కు మంటూ గడుపుతున్న కాలనీవాసులు



కొత్తపేటలో సొమ్మసిల్లిన ఓ మహిళ